**కథ**

# అనుగ్రహభాషణం

**టి.పి.హేమమాలిని**

**దాదాపు నెలరోజుల తర్వాత రామానుజాన్ని చూసిన నేను చాలా ఆశ్చర్యపోయాను. అంతటి విషయం, రామానుజం బట్టతల మీద హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా కేశాలు మొలవడమో, ఒబేసిటీ ట్రీట్‌మెంట్ ద్వారా వాడి బానపొట్ట కొద్దిగా లోపలికి పోవడమో కాదు.**

రూపురేఖలు చూసి కాదు నేనబ్బురపడింది. రామానుజం స్వభావంలో చాలా మార్పులు వచ్చాయి.

రామానుజం గురించి చెప్పాలంటే చాలా ఉంది. అత్యంత నిరాశాజీవుల్లో ముందుగా పెద్ద పీట వాడికే వేయాలి. ప్రతిదానికీ నిస్పృహగా మాట్లాడడం, ఏ పనైనా నిరాసక్తంగా చేయడం, ఇది మన వలన ఏమవుతుందిలే అన్న అభావం... ఈ లక్షణాలన్నీ మూర్తీభవిస్తే ఆ రూపం రామానుజానిది.

రామానుజానికి మంచి ఉద్యోగమే ఉంది. కానీ సాధకబాధకాలు ఎక్కువ. యజమాని దగ్గర ఒదిగి ఉండాలి. ఆ యజమాని చండశాసనుడు. ఎంత బాగా పనిచేసినా, మైక్రోస్కోప్‌లో సూక్ష్మక్రిములను చూసినట్లు, ఇంకా తప్పులు వెతుకుతూనే ఉంటాడు. అందువలన వృత్తిరీత్యా నిర్లిప్తత ఏర్పడింది. ఆ ప్రభావం వాడి జీవితం మీద కూడా ఉందని నా అభిప్రాయం.

ఇండియా ఆడుతున్న క్రికెట్ మ్యాచ్ మంచి రసపట్టులో ఉండి విజయావకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నా కూడా ''ఆ! వీళ్లెప్పుడూ ఇంతే! ముందు బాగా ఆడేసి, ఆ తర్వాత చతికిలబడతారు'' అంటాడు. 'శుభం పలకరా పెళ్లికొడుకా!' చందాన. నిజం చెప్పాలంటే అలాంటి సమయాల్లో వాడి పీక పిసికేయాలన్నంత కోపం వస్తుంది.

సరదాగా ఎప్పుడైనా కార్డ్స్ ఆడుతుంటే ఒక్క ముక్కేస్తే షో అయ్యే సందర్భాల్లో కూడా ఆ ముక్క వస్తుందని ఆశించడు. రావాలని ఆశపడడు. ఏదయితే అదవుతుందని ఊరుకుంటాడు. ఎలాగూ జరిగేది అదే! కానీ ఆశ సహజం కదా అన్నది నా ఉద్దేశ్యం. అది మచ్చుకైనా ఉండదు. రామానుజం కొడుకు మహా తెలివైనవాడు. అన్ని క్లాసుల్లోనూ ఫస్టే. టెన్త్‌క్లాస్ పరీక్షలు రాసొచ్చి తొంభై అయిదు శాతం మార్కులు కచ్చితంగా వచ్చి తీరతాయని ఘంటాపథంగా చెప్పాడు నేనుండగానే.

''ఆ! ఈ రోజుల్లో అందరికీ కుప్పలుగా వస్తున్నాయి మార్కులు. స్కూళ్లలో బట్టీపట్టించేసి రాయిస్తే ఎన్నయినా వస్తాయి. పెద్ద గొప్పేం కాదు'' అన్నాడు రామానుజం అతి మామూలుగా.

''చూడు మావయ్యా! నేనెంతో కష్టపడి చదివాను. బట్టీబాపతు కాదు. ఈసారి పేపర్స్ చాలా టఫ్‌గా ఉన్నాయి. అందరికీ రావు మార్కులు'' అన్నాడు వాడు ఉక్రోషంగా. ఆప్యాయంగా భుజం తట్టాను వాడి కినుక తగ్గించాలన్నట్లుగా.

ఆశావాది ప్రతి లేమిలోను ఒక అవకాశాన్ని వెతుకుతాడు. నిరాశావాది ప్రతి అవకాశంలోను ఒక లేమినే చూస్తాడన్న అక్షర సత్యానికి ప్రత్యక్ష ఉదాహరణ రామానుజం.

అటువంటి రామానుజంలో నేనూహించలేని పెనుమార్పులు కనిపించాయి. చాలా హుషారుగా కనిపిస్తున్నాడు. వాడి దృక్పథం కూడా మారిందనడానికి మంచి దృష్టాంతం కనిపించింది. వాడితో పని పడి వాడి ఆఫీసుకెళ్లాను. అదే టైమ్‌లో బాస్ రామానుజాన్ని చీవాట్లు పెడుతున్నాడు. మామూలుగా రామానుజం అయితే ఆ తిట్లకి స్పందించడు. పౌరుషపడడు. కానీ మారిన రామానుజం మాట్లాడాడు.

''సర్! గివ్ అండ్ టేక్ రెస్పెక్ట్. ఎంతబాగా చేసినా మీరింకా ఏదో అంటూనే ఉంటారు. నాకున్న స్కిల్స్‌కి ఏ మల్టీనేషనల్ కంపెనీలోనైనా పిలిచి ఉద్యోగమిస్తారు. మీకిష్టం లేకపోతే రిజైన్ చేస్తాను'' నాకేదో అద్భుతం చూస్తున్నట్లనిపించింది. రామానుజమేంటి? ఇలా మాట్లాడడమేమిటి? ఆఫీసర్ పిలిచి కారణం లేకుండా చీవాట్లు పెడుతుంటే వంచిన తల ఎత్తని రామానుజమేనా? స్టాఫ్ అంతా ముద్దుగా 'గంగి గోవు' అని పిల్చుకునే రామానుజమేనా?

ఇది నాకు మాత్రం ఎనిమిదో వింతే!

మంచి వర్కర్‌ని వదులుకోవడం ఇష్టంలేని ఆఫీసర్ మారుమాట్లాడకుండా వెళ్లిపోయాడు తన కేబిన్‌లోకి.

''ఏరా విష్ణూ! ఏంటిలా వచ్చావు?'' అంటూ నావైపు వచ్చాడు.

''పని సరేగానీ! ఏమిటీ వింత? ఆవు గర్జించడమా? ఆశ్చర్యంగా ఉంది. నిర్లిప్తత, నిరాశ ఆభరణాలైన మా రామం రెండోరూపాన్ని చూస్తున్నాను. ఖచ్చితంగా ఏదో జరిగే ఉంటుంది'' నా అచ్చెరువంతా శబ్దావతారమెత్తింది.

''అవున్రా జరిగింది! నువ్వు నెలరోజులుగా ఊర్లో లేవుగా! నీకు తెలీదు'' కూనిరాగమొకటి తీస్తూ చెప్పాడు.

''దేవుడు ప్రత్యక్షమయి నీ స్వభావాన్ని ఒక్కసారి మార్చేశాడా?''

''దేవుడు కాదు, దేవుని ప్రతినిధి.. యోచి స్వామి'' తన్మయానందాలతో తూగిపోతూ చెప్పాడు.

''యోచి స్వామా? ఇంతకీ ఎవరాయన?''

''యోగ చిదానందస్వామి'' ఎబ్రివేషన్‌కి ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చాడు.

''మాయాతాయెత్తో, మంత్రభస్మమో ప్రసాదించారా? నిన్నేదో పిల్లిపిల్లలా మార్చేసినా బావుండేది. చక్కా చంకలో పెట్టుకుని తిరుగుదును.''

''విష్ణూ!'' నా మాటల్లో వెటకారపు ఛాయలు కనిపించాయేమో, వాడి గొంతులో కోపచిహ్నాలు ఎదుర్కొన్నాను.

''స్వామిని అంత తక్కువగా అంచనా వేయకు. కేవలం ఆయన అనుగ్రహభాషణం వల్లనే నేనీస్థితిలో ఉన్నాను. నువ్వు కూడా ఆయన్ని దర్శించుకో. అంతా బాగుంటుంది'' అన్నాడు అదేదో పార్టీల ఎన్నికల నినాదంలా.

''నాకిలాంటి స్వామీజీలు, బాబాలు అంటే చుక్కెదురన్న సంగతి మర్చిపోయావా?'' అడిగాను.


''అక్కడే తప్పులో లెగ్గెట్టావు. ఈ స్వామిని చూసినంత మాత్రానే నా అభిప్రాయం మారిపోతుందని నా గట్టి నమ్మకం. ఆహా! తేజస్సుతో వెలిగే ముఖారవిందం, చల్లటి చూపులు, మెత్తటి మాటలు... ఒరే! నువ్వు ఆయన్ని దర్శించి తీరాలిరా. రేపే నిన్ను తీసుకువెళతాను'' కంకణం కట్టుకున్నాడు.

రామానుజంలో ఇంత మార్పు రావడానికి కారణమైన ఆయన్ని నాకూ చూడాలనిపించింది.

★ ★ ★

నగరానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆశ్రమానికి చేరుకున్నాం. భక్తులందరూ పద్మాసనంలో కూచుని ధ్యానం చేస్తున్నారు. రామానుజం స్వామివారి శిష్యుడితో మాట్లాడాడు. కొద్దిసేపటి తర్వాత మాకు లోపలికి వెళ్లడానికి అనుమతి లభించింది. ఇద్దరం స్వామివారి ఆంతరంగిక మందిరం

లోకి



ప్రవేశించాం. కాషాయ వస్త్రాల్లో దర్శనమిచ్చారు స్వామి. నిజంగా రామం చెప్పినట్లుగానే ఆయన్ని చూడాలనే ఏదో ఆధ్యాత్మిక భావన కట్టిపడేసింది. ఎంతో ప్రశాంతత ఆవహించింది.

''స్వామీ! వీడు నా స్నేహితుడు విష్ణు. మీ దర్శనార్థమై వచ్చాడు'' అన్నాడు రామానుజం వినయంగా.

''నీ బలవంతం మీద వచ్చాడుగానీ ఇతనికి ఇలాంటివంటే నమ్మకం లేదు నాయనా'' అన్నారు స్వామి. ఖంగుతిన్నాను.

''అది కాదు స్వామీ! నన్నపార్థం చేసుకోకండి'' అన్నాను అప్రయత్నంగానే చేతులు జోడించి.

''రామానుజం! నీ ప్రమోషన్ విషయం ఎంత వరకు వచ్చింది?'' అడిగారు స్వామి.

''స్వామీ! మీరు చెప్పినట్లే నేను గట్టిగా అడిగేసరికి మా బాస్ ఒప్పుకున్నాడు. నేను నెమ్మదిగా ఉండిపోయినట్లయితే ఆ ప్రమోషన్ నాకన్నా ఏమాత్రం అనుభవం లేనివాళ్లకి వెళ్లిపోయేది. మేనేజర్ పుణ్యమా అని నేను హెడ్డాఫీసు లోనే గట్టిగా ప్రయత్నించడం వలన నాకు దక్కింది. అంతా మీ దయ'' రామానుజం నమ్రతగా చెప్పాడు.

''నువ్వు చాలా ధైర్యనం తుడివి. ఇతరులు ఏమను కున్నా లక్ష్యపెట్టవు. తలచిన పని అయ్యేంతవరకు నిద్రపోవని చెప్పానుగా నాయనా!'' చిద్విలాసంగా నవ్వారు స్వామి.

సునిశితమైన నా మెదడు ఏదో విషయాన్ని కనిపెట్టేసింది.

''స్వామీ! నాకు ధనప్రాప్తి ఎలా ఉంది?'' రామానుజం అడిగారు.

''నీకు ఆకస్మిక ధనలాభం తన్నుకుని వస్తోంది. అంతేకాదు. దాన ధర్మాలు కూడా చేస్తావు. చెప్పానుగా, ఇతరులు బాధపడితే చూడలేని మనస్తత్వం నీదని'' సెలవిచ్చారు స్వామి.

మరికొంతసేపటి తర్వాత స్వామివారి వద్ద అనుమతి తీసుకుని వచ్చేశాం.

''నీకేమనిపించింది?'' బయటకు రాగానే రామానుజం అడిగిన ప్రశ్నకి చిరునవ్వు బదులిచ్చాను, వాడికి ఎక్కడో మండేటట్లుగా.

కొన్నాళ్ల తర్వాత...

ఓరోజు సాయంత్రం అందరూ వెళ్లిపోయినా నాకు కొంచెం పనుండి సీట్లోనే ఉండిపోయాను. గబగబా వచ్చాడు రామానుజం.

''చూశావా! నేను చెప్తే నమ్మలేదు. స్వామివారు చెప్పిన మాటలన్నీ నిజమైనాయి'' ఆనందాయాసాలతో చెప్పేడు.

''సరే! ఏమైందో చెప్పు?''

''మా కంపెనీ ప్రాజెక్ట్ ఒకటి ఫారిన్ కొలాబరేషన్‌తో స్టార్టవబోతోంది. దానివలన వచ్చే లాభం కోట్లల్లో ఉంటుంది. అందుకే ఎంప్లాయీస్ అందరూ ఉత్సాహంగా పనిచేయాలని అందరికీ రెండునెలల జీతం బోనస్‌గా ఇస్తున్నారు. ఇది ఆకస్మికం, అంటే అనుకోని ధన లాభమేగా?'' విశదీకరించి ప్రశ్నించాడు, నన్నెత్తి చూపిస్తున్నట్లుగా.

''అవును. ఆమధ్య నుంచీ ఫారిన్ కొలాబరేషన్ కోసం చర్చలు జరుగుతున్నాయిగా'' అన్నాను ఇదేమీ అనుకోని విషయం కాదన్నట్లు.

''నిజమే! కానీ మాకు బోనస్ ఇస్తారని ఊహించలేదు. స్వామీజీ చెప్పినట్లు ఆకస్మిక ధనలాభం వచ్చింది. ఆయన వాక్కు గొప్పదని ఒప్పుకుంటావా?''

''నేను స్వామి గొప్పదనాన్ని కాదనలేదే?'' ప్రశ్నతో కూడిన జవాబిచ్చాను. ఇలా పిచ్చాపాటి మాట్లాడుకుంటుండగా ఎవరో ఇద్దరు వ్యక్తులు వచ్చారు.

''నమస్తే సార్! మేము ప్రేమసమాజం నుండి వస్తున్నాం. మా సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా తెరవబోతున్న అంధుల పాఠశాలకి విరాళాలు సేకరిస్తున్నాం. మీకు తోచినంత ఇవ్వండి. ప్లీజ్!'' రిక్వెస్ట్ చేశారు వాళ్లు.



నేను ఒక వంద రూపాయలు ఇచ్చాను. రామనుజం ఐదు వందలు ఇచ్చాడు. ఆశ్చర్యపోవడం నా వంతయింది. రామానుజం సాధారణంగా ఇలాంటివాటికి స్పందించడు. అంటే పిసినారి కాదు.

వాళ్లు వెళ్లిపోయాక ''రామం! ఏంటి, ఏకంగా ఐదు వందలు ఇచ్చేశావు'' అడిగాను.

''ఇచ్చేశానురా. పాపం! అంధుల కోసం అన్నారు కదా! ఏదో చేయాలనిపించింది. అయినా ఇది నా గొప్ప కాదురా! స్వామి వాక్ ఫలితమే! నేను దానధర్మాలు చేస్తానని ఆయన నా జాతకం చెప్పారు కదా!''

''అంటే ఆయన చెప్పేరు కాబట్టి విరాళమిచ్చావా! ఆయన మాట నిజం చేయాలనా?'' అడిగాను. గుర్రుగా చూశాడు నావైపు.

''అసలేంట్రా నీ ఉద్దేశ్యం? ఎప్పటి నుంచో అడుగుదామనుకుంటున్నాను. స్వామి అంటే నీకు సదభిప్రాయం లేదు. మనం అంత స్థాయికి ఎదుగగలమా? ఆయనలో ఎంతో కొంత మహిమ లేకపోతే ఇంతమంది జనం ఎందుకు అనుసరిస్తారు? ఆయన చెప్పినవన్నీ జరుగుతున్నాయి తెలుసా నా జీవితంలో!'' అన్నాడు రామానుజం.

''అది ఆయన మహిమ కాదనీ, నీ యోగమనీ అంటాను నేను.''

''ఎన్నాళ్ల నుంచో నేను చేయాలనుకుని వాయిదా వేస్తున్న పన్లన్నీ చకచకా చేస్తున్నాను తెలుసా?''

''ఒరే రామం! నా స్వభావం నాకు బాగా తెలుసు. ఆంజనేయస్వామికి అనుంగు సోదరుడిలాంటివాడివి. ఆ స్వామికి తన బలం తనకు తెలియదట. ఆయన శక్తి ఆయనకు గుర్తు చేసి ప్రోత్సహిస్తేనే సముద్రాన్ని సైతం లంఘించారు. అదేవిధంగా నీలో ఈ మార్పు, అంతర్గతంగా నీలో దాగిన నీ లక్షణాలే.''


అర్థం కానట్లు మరింత వివరించమన్నట్లు చూశాడు.

''సాధారణంగా మనలో ఉన్న గొప్పతనం మనం తెలుసుకోలేం. అది వేరెవరైనా గుర్తించి చెప్తే అదో గొప్పగా భావించి సంబరపడతాం. ఉదాహరణకి నన్నే తీసుకో. నన్నందరూ సినిమా హీరో శోభన్‌బాబులా ఉంటావని పొగిడాకే నా రూపం నాకు తెలిసింది. ఆ చెప్పే వ్యక్తి మనకన్నా కొంచెం పై స్థాయిలో ఉంటే ఆ మాటలు అక్షర సత్యాలనుకుంటాం. అదే వేదవాక్కు అనుకుంటాం.

నేడు ఎందరో స్వామీజీలు, బాబాలు అడుగడుగునా వెలుస్తున్నారు. మన దేశ జనాభాతో పాటు ఈ సంఖ్య కూడా పెరుగుతోంది. ఎందుకు? మనలోని మూఢనమ్మకాల వలన, ప్రజల అమాయకత్వం వలన. అంటే అందరూ ఒకే కోవకి చెందినవారని నా ఉద్దేశ్యం కాదు. వారిలో మహానుభావులున్నారు. సేవాతత్పరులున్నారు.

ప్రజల అమాయకత్వంపై వారికి బలం. నిజంగా ఏ గొప్పదనం లేనివాళ్లు కూడా అగ్రపూజలందుకుంటున్నారు. అయితే వీరు చేసే పని ఒక్కటే అనిపిస్తుంటుంది. అది ప్రజలలో వారియందు వారికి నమ్మకం కలిగించడం. ఇది ఒకరకంగా మంచే. సాధారణంగా మనం ఏ విషయంలోనైనా వ్యతిరేకాభిప్రాయాలు కలిగి ఉండి, ఆ విషయమే ఏ స్వామి నోటి ద్వారానో అనుగ్రహభాషణంలా వింటే అది మనమీద వేగంగా పనిచేస్తుంది. స్వామి చెప్పినందువలన దృక్పథం మారుతుంది.

నువ్వు చాలా మంచివాడివి అని నిన్ను ఎవరైనా పొగిడితే కాదనగలవా? నాకు త్వరలోనే అదృష్టం వరించబోతోందన్న అనుగ్రహభాషణాన్ని అడ్డుకోగలిగేవాడుంటాడా?




నీకు తెలివితేటలు చాలా ఎక్కువ. కానీ ముందుకు దూసుకుపోయే మనస్తత్వం లేకపోవడం వలన వెనుకబడిపోయావు అని ఓ జ్యోతిష్యుడు చెప్తే నువ్వు నీ తెలివితేటలకు దూకుడు తప్పకుండా జోడిస్తావు. నీ విషయంలోనూ అంతే! నువ్వు తెలివైనవాడివి. కానీ నిర్లిప్తత ఎక్కువ. ఏ బుద్ధి పుట్టి స్వామి దర్శనం చేసుకున్నావో కానీ ఆ నిర్లిప్తత పోయింది. ఆశావహదృక్పథం ఏర్పడింది. అందుకైనా ఆ స్వామికి ప్రణామాలర్పించాలి'' చెప్పడం ఆపి ఊపిరి పీల్చుకున్నాను.

''మరి నా చిన్న కొడుక్కి మెడిసిన్ సీటు రాదనుకున్నాం. స్వామి చెప్పిన తరువాతే వచ్చింది. దీనికేమంటావు?'' నన్నెలాగైనా ఒప్పించాలనుకున్నట్లున్నాడు.

''అది నీ కొడుకు గొప్పదనం. వాడు ఆల్‌రెడీ టాప్ ర్యాంకింగ్‌లో ఉన్నాడు. ఒక అభ్యర్థి రిజర్వేషన్ కోటాలో జాయినవ్వకపోవడం వలన నీ కొడుక్కి వచ్చింది. ఇదంతా కాకతాళీయం. ఏదేమైనా ఒకరకంగా స్వామి గొప్పవారే. నీలాంటి నైరాశ్యులని మారుస్తున్నారు.''

''అమ్మయ్య! ఒప్పుకున్నావు కదా! మన ప్రతిభ ఎంత ఉన్నా వెన్ను తట్టేవారుండాలని!''

''ఈ స్వాముల మాటల వలన ఓ ప్రమాదం కూడా ఉంది. నీకు లాటరీలో ఆకస్మిక ధనలాభం వస్తుందని ఎవడికైనా చెప్తే వాడు చేయాల్సిన పనేంటి? ముందుగా లాటరీ టిక్కెట్ కొనడం. అది చేయకుండా స్వామి చెప్పినట్లు లాటరీ తగులుతుందని ఎదురుచూస్తూ కూచోడం పెద్ద పొరపాటు. దీని వలన బద్ధకం, పని దొంగతనం ఏర్పడతాయి'' కష్ట నష్టాలు కలబోశాను.

ఇంకా రామానికి తృప్తి కలగలేదు.

''మరి మనం వెళ్లగానే, నువ్వు మనస్ఫూర్తిగా రాలేదని, నా బలవంతంతో వచ్చావని ఎలా చెప్పారురా విష్ణూ?'' ప్రశ్నించాడు అమాయకంగా.

''ఎందుకు చెప్పడు? సారీ, చెప్పరురా? అతను డిగ్రీవరకు నా క్లాస్‌మేట్, బెంచ్‌మేట్, రూమ్మేట్. నాకు మానవశక్తి మీదే తప్ప ఇలాంటి వాటిమీద నమ్మకం లేదని తెలిసినవాడు. ఎన్నాళ్లు ప్రయత్నించినా ఉద్యోగం రాలేదని ఎక్కడికో పారిపోయాడని విన్నాను. యోగానంద ఇలా అవతారమెత్తిన యోచిస్వామి'' కొసమెరుపుతో లోగుట్టు విప్పాను.

రామానుజం ఆశ్చర్యపోవడం నాకేమీ అబ్బురమనిపించలేదు.